# సానుభూతి

రాత్రి పదిగంటలు దాటింది. పగలంతా అలసిన శరీరం నిద్రను కోరుతున్నది. రోజులాగే బాతాఖానీకి వచ్చిన మిత్రద్వయం త్వరలో కదిలే సూచనలు కనిపించలేదు. గదిలో వున్న మంచి కుర్చీలు చెరొకటి ఆక్రమించుకొని, సిగరెట్లకు దహన సంస్కారం చేస్తున్నారు. మా బాతాఖానీ ఆవరణలోకి రాని విషయాలంటూ వుండవు. విశ్వనిర్మాణం దగ్గరనుంచి పరమాణు స్వరూపం వరకు, అనాది మానవ నాగరికత మొదలుకొని రాబోయే కాలములలో వర్ధిల్లబోయే నాగరికతవరకు, ఇతిహాసాల దగ్గరనుంచి అత్యాధునిక సాహిత్యంవరకు — మానవకోటికి తెలిసిన ప్రతివిషయం—ఆ బాతాఖానీ ఆవరణలోనికి వస్తాయి. ఆరోజు వాళ్ళిద్దరూ చాల గట్టిగా మాట్లాడుతున్నారు. నేను మాత్రం నిద్రాభారంవలన అంతగా మాట్లాడటంలేదు. వాళ్లు ఏ విషయం మీద మాట్లాడుతున్నది కూడా నాకు అంతగా పట్టలేదు.

"ఎలాగయినా నలుగురి సానుభూతి లేకుండా జీవించటం చాలకష్టం. నా వుద్దేశంలో అసంభవం" అన్నాడు నరసింహం కుర్చీ కిటికీ దగ్గరకు జరుపుతూ.

"సుఖంగా బ్రతకటానికి సానుభూతికి సంబంధం లేదు. నలుగురూ నిన్ను అసహ్యించుకొంటే నీకు వచ్చే జీతం రాకపోతుందా?... తిండి గుడ్డా దొరకకుండా పోతాయా? మనం జీవించటానికి యితరుల సానుభూతి వుండాలనటంలో అర్థం లేదు." రామారావు తన అభిప్రాయాన్ని చెప్పాడు. రామారావు ఎప్పుడు మాట్లాడినా చివరివాక్యం ఎదుటివాని మాటకు అర్థం లేదని సూచిస్తుంది.

"అదేంమాటగాని, అందరూ మనను ద్వేషిస్తూవుంటే జీవితం చాల బాధగా వుంటుంది. నీకు ఒక్క స్నేహితుడంటూ లేడనుకో, నీకు తెలిసిన వాళ్ళందరకు నీ వంటే అసహ్యంఅనుకో—అప్పుడు యింత ఆనందంగా జీవించగలవా?" ప్రశ్నించాడు నరసింహం.

"అలా జీవించినవాళ్ళు లక్షమంది. అసలు అలాంటి జీవితం గడపిన వాళ్ళు చాల గొప్ప వాళ్ళయ్యారు" అన్నాడు రామారావు. రామారావు మాటలు ఆ పేటలో వున్న వాళ్ళందరికి వినిపించి వుంటాయి.

"ఎవరో ఒకళ్ళిద్దరి సంగతి చెప్పకు; మనలాంటివాడి సంగతి మాట్లాడు ......... ఇంతెందుకు కనకారావు ఏమయ్యాడు?" అన్నాడు నరసింహం.

ఏనాటి కనకారావు? ఆ మాటతో హృదయంలో ఎక్కడో దాగివున్న పాత ఘట్టం మీద కాంతి ప్రసరింపజేసినట్లయింది. మాలో వున్న క్రూరత్వానికి, కాఠిన్యానికి, గురి కనకారావు. కేంద్రీకరించబడిన సూర్యకిరణాలకు మెత్తని దూది భగ్గుమన్నట్లు, అతని జీవితం మాద్వేషానికి కాలిపోయింది.

* * * *

అయిదేళ్ళ క్రితం జరిగిన సంగతి:

మబ్బులు దట్టంగా కమ్ముకొని, వుదయం తొమ్మిది గంటలకుకూడ చీకటిగా వుంది. వర్షం కురుస్తానని భయపెడుతోంది. వండినవాడిని మనస్సులో తిట్టుకుంటూ హాస్టలు మెస్సులో అన్నం తింటున్నాను. ఇంతలో

## వేములపల్లి గోపాలకృష్ణ

నా ప్రక్క యింకొక వ్యక్తి వచ్చి కూర్చున్నాడు. మొఖం చూడగానే హాస్టలులో క్రొత్తగా చేరాడనుకున్నాను. వచ్చిన వ్యక్తి తెల్లటి బట్టలు వేసికొన్నాడు. అతను పొడగరికాకపోయినా కురూపికాడు. పచ్చటి శరీరచ్ఛాయ. అతనిని చూసినవంటనే నాటకాలలో స్త్రీ పాత్ర ధరించటానికి సరిపోతాడనిపిస్తుంది.

కొద్ది నిముషాలలో యిద్దరం మాటలలోకి దిగాం. "క్రొత్తగా చేరారా?" అని ప్రశ్నించాను నేను.

"అవును"

"పేరు"

"కనకారావు"

"ఏందులో చేరారు"

"బి. యస్. సి; ఫిజిక్స్"

"ఇంటర్ మీడియెట్ ఎక్కడ చదివారు?"

"రాజమండ్రిలో"

"బి. యస్. సి. కూడ అక్కడే చదవకపోయారా?"

"అక్కడ సీటు దొరకలేదు"

కొద్ది నిముషాలు యిద్దరం మాట్లాడలేదు. "మీరేం చదువుతున్నారు?" అన్నాడు కనకారావు.

"బి. యస్. సి; కెమిస్ట్రి"

తరువాత భోజనాలు అయ్యేవరకు మేము మాట్లాడలేదు. ఇది కనకారావుతో నా మొదటి పరిచయం. తరువాత ఎప్పుడు కలుసుకొన్నా అభినందించేవాడు. నేను కూడ చిరునవ్వుతో జవాబు చెప్పేవాడిని. అంతకు విశేషించి మా పరిచయం దృఢపడలేదు. నాకు అప్పటినుండి కనకారావు అంటే మంచి అభిప్రాయం వుండేది — ఆ అభిప్రాయానికి కారణం తెలియదు.

వేసంగి సెలవులవరకు మా పరిచయం అలాగే వుండిపోయింది.

వేసంగి సెలవులు వచ్చాయి. హాస్టలు విద్యార్థులంతా — పరీక్షలున్న సీనియర్సు తప్ప—ప్రయాణం హడావుడిలో వున్నారు. నేను సాయంత్రం బండికి ప్రయాణం నిశ్చయించుకొన్నాను. కనకారావుకూడ వస్తాడేమో కనుక్కోటానికి అతని గదికి వెళ్లాను. నేను వెళ్ళేసరికి కనకారావు ఏదో పుస్తకం — నవల కాబోలు — చదువుతున్నాడు. తలుపు తెరచిన చప్పుడు విని తలయెత్తి, నేను రావటం చూసి "రండి, కూర్చోండి" అన్నాడు, ఎదురుగా వున్న కుర్చీ చూపిస్తూ.

నేను కూర్చున్నాను. కొద్ది నిముషాల తరువాత "హమ్మయ్య! సెలవు లిచ్చారు" అన్నాను.

అవును అన్నట్లు చిన్నగా నవ్వాడు కనకారావు.

"యేడాది అంతా చిటికెలో గడచినట్లు వుందండి" అన్నాను నేను.

"జూనియర్ క్లాసు గదా!" అన్నాడు కనకరావు చేతిలో వున్న పుస్తకాన్ని బల్లమీద పెడుతూ, కొంచెం సేపు ఆగి.

"ఎప్పుడు వెళ్తున్నారు" అని అడిగాను.

"సాయంత్రం...మీరు?"

"నేను వెళ్ళటం లేదు"

"ఏమి"

కనకారావు చాలాసేపటివరకు మాట్లాడలేదు. నా ప్రశ్న వినిపించుకోలేదేమో అనుకొని, మరల ప్రశ్నించబోయే సరికి జవాబు చెప్పాడు.

"మా అమ్మ, నాన్న లేరు...చిన్నప్పుడే చనిపోయారు"

"తోడబుట్టిన వాళ్ళెవరూ లేరా?" అన్నాను ఆశ్చర్యాన్ని ప్రదర్శిస్తూ.

"ఎవ్వరూ లేరు. మా తల్లిదండ్రులకు నేను ఒక్కడినే" అన్నాడు కనకారావు. అతని గొంతుక స్పష్టంగా వుంది. అతని గొంతుక బాధను వెల్లడిస్తోంది.

"చుట్టాలెవరూ లేరా?" మరింత ఆశ్చర్యంతో ప్రశ్నించాను.

"దగ్గర చుట్టాలెవరూ లేరు" అన్నాడు కనకారావు. ఈసారి అతను ఆ బాధను, నా ప్రశ్నలమూలంగా వుద్భవించిన విసుగును కప్పిపుచ్చటానికి కాబోలు చిన్నగా నవ్వాడు.

నేను చాలా సేపటివరకు మాట్లాడలేదు. ఇటువంటి సమయంలో ఏమి మాట్లాడాలో నాకు తట్టలేదు. చివరకు "మరి చిన్నప్పటినుండి మీ చదువు" అన్నాను.

కనకారావు కొద్ది నిముషాలవరకు మాటలాడలేదు. ఆ తరువాత జవాబు చెప్పాడు: "నేను పుట్టిన వెంటనే మా అమ్మ మరణించింది. నేను మా అమ్మను ఫొటోలో తప్ప చూడలేదు. నేనంతా మా అమ్మ పోలికే." మా నాన్నగారు మాత్రం నా పదమూడవ సంవత్సరం వరకు బ్రతికివున్నారు కాని..." కొంచంసేపు ఆగి మిగతా చరిత్రను ఎలా చెప్పాలో ఆలోచిస్తున్నట్లు నేలకేసి చూస్తూ వూరుకొన్నాడు. "...మా నాన్న అదో రకం వ్యక్తి. నాకు తెలిసినంతవరకు ఆయనకు వ్యాపారం మీద తప్పితే మిగతా విషయాలమీద మనస్సు పోయేది కాదు. ఆయన మోటారు లారీలమీద రవాణా వ్యాపారం చేస్తూ వుండేవాడు. వారానికి అయిదురోజులయినా వ్యాపార నిమిత్తం ఇంకో వూరిలో వుండేవాడు. వూర్లో వున్నప్పుడయినా ఎక్కువకాలం యింట్లో వుండేవారు కాదు. ఆ బజారులో వున్న వ్యాపారస్తులతో మాట్లాడడానికి వెళ్ళేవారు. ఇంట్లో వున్నప్పుడు బీరువాముందు కూర్చుని ఏవో కాగితాలు తిరగవేస్తూ వుండేవారు. నాతో అంతగా మాట్లాడేవారు కాదు.

"మా నాన్నగారితో మాట్లాడాలంటే చీకటిపడిన తరువాతగాని వీలుండదు. రాత్రి నాన్నగారు—వూరిలో వుంటే— సావడిలో మంచం వేసికొని పడుకొనేవారు. నేనుఏదో మాట్లాడదామని కుతూహలంలో వచ్చి మంచానికి దూరంగా కాలి బొటనవ్రేలు నేలమీద రాస్తూ నిలబడేవాడిని. చాలాసేపటికిగాని నన్ను గమనించేవారు కాదు. అప్పుడు "ఏమిటిరా?" అనేవారు. నేను "ఏం లేదు" అనేవాడిని. "ఇలా వచ్చి కూర్చో" అనేవారు మంచం పట్టె చూపెడుతూ. నేను మంచం పట్టెమీదకూర్చునేవాడిని, అరచెయ్యి గడ్డానికి ఆనించి. చాలసేపటివరకు అలాగే కూర్చునేవాడిని; కాని ఆయన ఏమీ మాట్లాడేవాడు కాదు. ఏవో తెగని విషయం మీద ఆలోచిస్తూ వుండేవారు చివరకు 'వెళ్ళి మంచంమీద పడుకో' అనేవారు... అలావుండేది మా సంభాషణ.

"బాగా వయస్సు ముదిరిన ఒక ముసలమ్మ మాయింట్లో నేవుండి అన్నం వండిపెట్టేది. నాకు ఆమె [illegible] తెలియదు గాని, అమ్మమ్మా అని పిలిచేవాడిని. ఆవిడ కూడా అంతగా మాట్లాడేది కాదు ఎప్పుడూ ఏవో గొణుక్కుంటూ వుండేది. నేను ఆవిడతో అవసరమయిన విషయాలు తప్పించి మాట్లాడేవాడిని కాదు."


కనకారావు మరల ఆగాడు. చాలసేపటికి క్షీణించిన గొంతుకతో మొదలుపెట్టాడు.

"ఇలా నా పదమూడవ సంవత్సరం వరకు జరిగింది. అప్పుడు నేను నాల్గవఫారం చదువుతున్నాను. ఒకనాడు నేను బడి నుండి వచ్చేసరికి నాన్నగారు నూటమూడు డిగ్రీల జ్వరంతో పడుకొని వున్నారు. అలా జ్వరం నాలుగురోజులు కాబోలు వుంది. అయిదోరోజు మధ్యాహ్నం మంచం ప్రక్కగా విచారంగా నిలుచుని వున్నాను. నాన్నగారు కొంచంసేపటికి కన్ను తెరచి చుట్టూ చూశారు. నావైపు తిరిగి దగ్గరకు రమ్మనమన్నట్లు సంజ్ఞచేశారు. నేనువెళ్ళి మంచం పట్టెమీద కూర్చున్నాను. అప్రయత్నంగా నాకళ్లు చెమ్మగిల్లాయి. నాన్నగారు ఒకచేత్తో నావీపు నిమురుతూ, రెండో చేతిలోకి నాచేతిని తీసుకొని, వినిపించీ వినిపించకుండా ఏదో చెప్పారు. అంతవరకు నాలోవున్న దుఃఖం అంతా ఒక్కసారి బయటకు వచ్చింది— నేను కుమిలి కుమిలి ఏడవటం మొదలుపెట్టాను. నాన్నగారు మాత్రం నావీపు నిమురుతూ నన్ను ఓదార్చటానికి ఏవోమాటలు చెప్పారు....... నేను మా నాన్నగారి కళ్ళలోకి ఎప్పుడూ సూటిగా చూడలేదు. ఆయనంటే నాకు మొదటి నుండి ఒకరకం భయం వుండేది. కాని ఆ నిముషాన ఆయన కళ్లుగూడ చెమ్మగిల్లి వున్నాయని నా నమ్మకం...తరువాత ఒక [illegible] నాన్నగారు చనిపోయారు" కనకారావు ఒకనిట్టూర్పు విడిచాడు. చాలా సేపటివరకు మాట్లాడలేదు. నేను యిక చెప్పవలసినది అయిపోయింది అనుకుంటూవుంటే తిరిగి ప్రారంభించాడు.

"చనిపోయేముందు ఆ స్తిఅంతా నా పేర వ్రాసి గుంటూరులో ఒకప్లీడరును ట్రస్టీగా వుంచారు. మానాన్నగారు చనిపోయిన రెండు నెలలకు వంటవండే ముసలమ్మకూడ మరణించింది. తరువాత నేను రెసిడెంషి


మెక్లీన్సు యింతకు
ముందుకంటె పళ్లను తెల్లగా శుభ్రపరుచును!

MTY 44 TEL



# ★ సానుభూతి ★

యల్ స్కూలులో చదివాను," కనకారావు ముగించాడు.

ఇద్దరం మూగగా చాలాసేపు కూర్చున్నాం. ఆసమయానికి మాటలుకన్నా నిశ్శబ్దం ఉచితంగావుంది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక "వస్తాను"అంటూ యివతలకు వచ్చాను ఆ తరువాత చాలరోజులవరకు, ఖాళీగా కూర్చున్నప్పుడు, కనకారావుతో నాసంభాషణ జ్ఞాపకంవచ్చి, మనస్సు చివుక్కుమనేది.

కనకారావును మొట్టమొదట నేను కలుసుకొన్నప్పుడు, చాల తెలివయిన వ్యక్తి అయి వుంటాడనుకున్నాను. అతని ముఖకవళికలు చూచిన వారెవరయినా అలాగే వూహిస్తారు. కాని నావూహ నిజంకాదని తెలియటానికి ఎంతోకాలం పట్టలేదు. కనకారావుకు అందరికన్నా తక్కువమార్కులు వచ్చేయి. అతను పరీక్షలలో వ్రాసే జవాబులలో చెయ్యరాని తప్పులు వుండేయి. ఒకొక్కసారి అడిగిన ప్రశ్నకు, వ్రాసినజవాబుకు సంబంధం వుండేదికాదు. అయినా అతనియెడల నా అభిమానంపోలేదు. అప్పుడప్పుడు అతని మీద పైవిషయం మూలంగా కలిగిన జాలి అభిమానాన్ని ద్విగుణీకృతం చేసేది. మేమిద్దరం చాల తక్కువసార్లు మాట్లాడుకొనేవాళ్ళం; కనకారావుది అంతగా మాట్లాడే స్వభావంకాదు.

హాస్టలులో వున్న చాలమంది విద్యార్థులకు కనకారావు వచ్చిన కొద్దికాలంలోనే లోకువ అయ్యాడు. దీనికికారణం కనకారావు క్లాసులో ఆఖరివ్యక్తి అవటం ఒక్కటే కాదు. నిజంగా తక్కువమార్కులు వచ్చిన వాళ్లు నలుగురి ముందు 'షైన్' అవుతారు. కనకారావు ఎవ్వరితోనూ అంతగా మాట్లాడడు. అస్తమానూ తన పని తను చేసికొంటూ వుంటాడు. పలకరించినా ముక్తసరిగా జవాబు చెపుతాడు. అతను మాట్లాడితే ఏదో వింతధోరణిలో వుంటుంది. ఉద్దేశాలలో, ఆచరణలో తనలాగా లేనివానిని క్షమించటం కష్టం. తెలిసీ తెలియని వూహాల విద్యార్థులు తమ మనస్తత్వానికి అవగాహనగాని వ్యక్తిని క్షమించలేరు. అటువంటప్పుడు హాస్టలు కనకారావును నిర్దాక్షిణ్యంగా విమర్శించక ఎలావదిలివేస్తుంది? కనకారావు రోజుకొక గంటసేపు నలుగురితోనూ కలసి సినిమాలమీద, కాలేజీ లెక్చరర్లమీద, ఆడపిల్లలమీద ఘాటుగా మట్లాడివుంటే, అతను నలుగురి దృష్టిలోనూ తెలివయిన వాడికింద పరిగణింపబడేవాడు.

బహుశా ఆ రెండేళ్లు అతని జీవితం ఆ ధోరణిలో గడచినా బాగుండును—అప్పుడు ఈ ఘట్టం అంతా జ్ఞాపకం తెచ్చుకునే అవసరం వుండదు.

రెండవ సంవత్సరం హాఫ్ ఇయర్లీ పరీక్షలకు ఆశ్చర్యకరంగా కనకారావుకు చాల ఎక్కువ మార్కులు వచ్చాయి. ఎవరూ అతనికి అటువంటి మార్కులు వూహించలేదు. నేను యిది చూసి చాల సంతోషించాను. తరువాతగాని, ఈ సంఘటన అతని పతనానికి ఎలా దారితీస్తుందో తెలియలేదు.

ఒకరోజు ప్రొద్దున నేను స్నానం చేసి గదిలోకి వస్తున్నాను. మేడ మెట్లు ఎక్కి గేలరీలో ప్రవేశించగానే అక్కడో పది మంది విద్యార్థులు బాతాఖానీ వెయ్యటం చూశాను.

నన్ను చూడగానే అందులో ఒకడు—కృష్ణమూర్తి—"మీకు డెబ్బయి మార్కులు కావాలా ?" అన్నాడు. వెంటనే మిగతా విద్యార్థులంతా గొల్లుమని నవ్వారు. నాకు ఆ ప్రశ్నకు, నీళ్ళ విపరీతపు నవ్వుకు అర్థం తెలియలేదు.

"యిస్తారా ?" అన్నాను.

"మార్గం చెపుతాం; మీరు తెచ్చుకోవాలి." అన్నాడు.

"చెప్పండి" అన్నాను నవ్వుతూ

"కాపీ చెయ్యండి" అక్కడున్న వాళ్ళంతా మరల గొల్లుమన్నారు. మొట్టమొదటలో దీని భావం ఏమిటో తెలియలేదు. తరువాత నాకు తెలిసినది:ఆ మాట్లాడడం ఆ నవ్వటం కనకారావును వుద్దేశించి జరిగినవి. నేను అటువంటి సంభాషణలో తెలియకుండా పాల్గొన్నందుకు ఎంతో విచారించాను. ఆ సంభాషణ కనకరావుకు తెలిస్తే ఎంత విచారిస్తాడో అని మనస్సు చివుక్కు మంది.

అతనిమీద ప్రచారం అంతటితో ఆగిపోతుం దనుకున్నాను. ఈ సంఘటన జరిగిన నాలుగు రోజుల తరువాత, పనివుండి ఫిజిక్స్ డిపార్టుమెంటుకు వెళ్లాను. ఫిజిక్స్ డిపార్టుమెంటు అంతా చాల నిశ్శబ్దంగావుంది. ప్రక్కనే క్లాసులు జరుగుతున్నాయి. ఆ నిశ్శబ్దాన్ని భంగపరచకుండా వరండాలో నుంచి వెళుతున్నాను. ప్రక్కనే క్లాసులో నుంచి ఈ మాటలు వినిపించాయి: "అడ్డదారులు గుండా మార్కులు తెచ్చుకోవటం అనుకున్నావా మిష్టర్ కనకారావు! కొంచమయినా ప్రాథమిక సూత్రాలు తెలియాలి." కిటికీ లోనుంచి లోపలకు చాటుగా చూశాను. క్లాసు మధ్యలో కనకారావు బల్లమీద చేతులుఆనించి నిలబడి వున్నాడు. అతని మొహం కాంతి విహీనంగావుంది, బల్లకు ఆనించిన అతని వేళ్లు కంపిస్తున్నాయి. మాటాడుదామని నోరు తెరచాడు కాని పెదిమలు కూడ కంపిస్తున్నాయి.

నేను చప్పుడు చెయ్యకుండా వరండా దాటి వెళ్ళాను. కాలేజీ కమిటీ మెంబర్ల బంధుకోటికి అడ్డదారులు కలుగజేస్తూ బ్రతుకుతున్న లెక్చరర్‌కు ఎదుటివాని నిజాయితీ తెలుసుకోవటం కష్టం.

ఈ విషయం జరిగి అయిదు రోజులయింది. కాలేజీ మధ్యాహ్నం విశ్రాంతికి అప్పుడే వదలి పెట్టారు. మెట్ల దగ్గర గోడవగాను తోపెడిగాను వుంది. ఆ గుంపులో నుంచి "హల్లో, మీ స్నేహితునికి అయిదు రూపాయిలు జుల్మానా పడిందండోయ్" అని కృష్ణమూర్తి గొంతుక వినిపించింది. ఆ మాటలు కనకారావును గురించి చెప్పినవని తెలుసు. అయినా తెచ్చిపెట్టుకొన్న నవ్వుతో "నా స్నేహితుడంటే? నాకు చాల మంది స్నేహితులు వున్నారు. మీరు కూడ నా స్నేహితులే కదా!" అన్నాను.

"తెలియనట్లు మాట్లాడకండి. కనకారావుకు అయిదు రూపాయిలు జుల్మానా" అన్నాడు కృష్ణమూర్తి. మెట్లు దిగటం పూర్తి అయింది, హాస్టలు వైపు నడుస్తున్నాం.

"ఆ లెక్చరర్ ఏమైనా ప్రిన్సిపాలుతో రిపోర్టు చేశాడా ?" అన్నాను. నా గొంతుక నాకే కృత్రిమంగా, ఆ వేళ పూరితంగా వుం దనిపించింది.

"ఆ విషయం మీకెలా తెలుసు ?" కృష్ణమూర్తి ప్రశ్నించాడు.

"లెక్చరర్ అతనిని కోప్పడుతూ వున్నప్పుడు నేను వరండాలోనుంచి వెళ్తున్నాను. తరువాత ఏమయిందో తెలియదు" అన్నాను ఆవేశాన్ని తగ్గించుకొంటూ.

"తరువాత ఏముంది. ఇతను 'నేను కాపీ చెయ్యలేదు' అన్నాడు. అప్పుడు లెక్చరర్ 'నేను కాపీవిషయం కాదు మాట్లాడుతున్నది—అడ్డదారుల విషయం మాట్లాడుతున్నాను' అన్నాడు. కనకారావు కొంచంసేపు ఆగి 'అయినా మీకు నామీద అనుమానం వుందనుకుంటాను. దయవుంచి అటువంటి అనుమానం విడిచిపెట్టమని ప్రార్థిస్తున్నాను' అన్నాడు. లెక్చరర్ 'అనుమానం విడిచిపెట్టటమో, దృఢపరచుకోవటమో ప్రిన్సిపాలుకు వదల దల్చుకున్నాను' అని జవాబుచెప్పాడు. తరువాత ప్రిన్సిపాలుకు రిపోర్టు యిచ్చాడట. యిది మొత్తం గ్రంథం" కృష్ణమూర్తి ముగించాడు.

"ఆ నిముషాన కనకారావు మొహం చూసి అతను కాపీచేశాడని మీరు అనుమానించగలరా ?" అన్నమాటలు నాలిక చివరి వరకు వచ్చాయి. కాని ఆమాటలు కృష్ణమూర్తిలో అనవలసినవి కాదని వూరుకొన్నాను. ఇంతలో హాస్టలు జేరాం.

ఆరోజు సాయంత్రం ప్రకృతి చాల

ంది. చీకటులు మేఘాలలాగ
టున్నాయి. కర్రమెట్లమీద మను
క్కదిగుతున్న చప్పుడు అవ్యక్తంగా
ంది. హాస్టలు పాత ప్రక్కన అప్పుడే
న దీపాలు ప్రకాశవంతంగా లేవు.
కుడి నవ్వులాగా గాలి ఒక్కసారి
కరంగావచ్చి ఆగిపోయింది. నా చుట్టూ
రూపం లేనిభావం ఆవరించుకొంది.
యింకా దీపం వెయ్యలేదు.

ంతలో నాగది చప్పుడు అయింది.
'పలకు రండి" అన్నాను గోడదగ్గరకు
స్విచ్ వేస్తూ. లోపలకు వచ్చినది కనకా
వు. అతని మొహం కాంతివిహీనంగా వుంది.
ూర్చోండి" అన్నాను. కనకారావు ఎదు
గా వున్న కుర్చీలో కూర్చున్నాడు. చాల
పటివరకు మాట్లాడలేదు. ఆ నిశ్శబ్దం బాధా
రంగా పరిణమించింది. చివరకు అతను
దో మాట్లాడాలనే ప్రయత్నంలో "బాగా
ుకువుతున్నారా?" అన్నాడు.

"ఆఁ! వచ్చిన పనిఏమిటి" అన్నాను
శ్శబ్దం అంతమయినందుకు తేలికపడుతూ.

"ఏమీ లేదూ. ఊరికే వచ్చాను" అన్నాడు. కాని ఆ మాటల వెనుక ఏదో
దాస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

"చెప్పండి ఫరవా లేదు."

"ఆఁ ఏం లేదు" మరల అదేజవాబు. కొంచెంసేపు మాటలు లేవు. "వెళ్తాను" అంటూ కనకారావు లేచాడు. నేను "ఊఁ" అన్నాను అతనుఎందుకువచ్చాడో వూహించ లేక. అతను కొంతదూరం వెళ్లగానే "కనకారావుగారూ" అని పిలచాను కాని ఆ పిలుపు అతనికి వినిపించి వుండకపోవచ్చు. నేను తిరిగి పిలువలేదు కూడ.

మెస్సునుంచి తిరిగివస్తూ కనకారావు గదికి వెళ్ళాను "ఇందాక మీరు ఏదో చెప్పటానికి వచ్చారు" అన్నాను సూటిగా కుర్చీ లాగు కుంటూ.

"ఆఁ ఏం లేదు" అన్నాడు తెచ్చి పెట్టు కొన్న చిరునవ్వుతో.

"మీకు వేసిన జుల్మానాగురించి మాట్లా డుదామని వచ్చారా?"

కనకారావు కొంచంసేపు తటపటాయిం చాడు. చివరకు "అవును" అన్నాడు.

"మీరు వ్యాకుల పడకండి. నేను ప్రిన్సి పాలు దగ్గరకు వెళ్లి ఆ విషయం మాట్లాడు తాను"

"థాంక్స్"

నేను ప్రిన్సిపాలు దగ్గరకు ఎందుకు వెళ్లా నని అతనితో చెప్పానో నాకే అవగాహన కాలేదు. ప్రిన్సిపాలు నా మాట వినడని నాకు నమ్మకంవుంది.

మరుసటిరోజు ప్రిన్సిపాలు యింటికి వెళ్లాను. చిన్న కాగితం మీద నా పేరు, చదువు తున్నక్లాసు వ్రాసి అక్కడున్న ఫ్యూన్‌కి యిచ్చాను. వెంటనే లోపలకు రమ్మనమని కబురు వచ్చింది. నేను లోపలకు వెళ్లేసరికి ప్రిన్సిపాలు పెద్ద కుర్చీలో కూర్చొని వార్తా పత్రిక చదువుతున్నాడు. కాలరు లేని చొక్కా వేసికొని, మల్లెపువ్వుకన్న తెల్లటిలుంగీ కట్టు కున్నాడు. బట్టతల. బంగారపు ఫ్రేము కళ్ళ జోడులోనుంచి చాల తీక్షణంగా చూడ గలడు. అతనిని చూడగానే విద్యార్థులు తడ బడతారు. నవ్వినప్పుడు అతని మొహం చాల వికృతంగా తయారవుతుంది; దేవుడు అతనిని నవ్వటానికి సృష్టించలేదు.

నేను గదిలో ప్రవేశించగానే "ఆ కుర్చీలో కూర్చోవచ్చు" అన్నాడు ఇంగ్లీషులో.

నేను వెంటనే నాపని అయనతో చెప్పాను. "నా స్నేహితుడు కనకారావు విషయం మాట్లాడటానికి వచ్చాను. అతనిని నేను చాలకాలం నుండి ఎరుగుదును. అతను కాపీ చేసి వుండడని నా నమ్మకం. ఈ విష యం తిరిగి ఆలోచించండి"

"ఆలోచించే ఈపని చేశాము" ప్రిన్సి పాలు విసుగు కనపర్చాడు. విద్యార్థుల దగ్గర పులితోలు కప్పుకోవటం తెలుసు కాబట్టి మంచి ప్రిన్సిపాలు అని ఖ్యాతి గడించాడు.

"అతనిది చాల లేతహృదయం. ఈ జుల్మానా విషయం విని చాల కృంగి పోయాడు. మీరు గనక......"

"ఇరవై ఏళ్ల అనుభవాన్ని బట్టి నా వుద్దేశం విద్యార్థులందరివి లేత హృదయాలని మంచి హృదయాలని కూడ. అయినా ప్రిన్సిపాలు అన్నవాడు క్రమశిక్షణకోసం ఇటువంటి చర్య తీసికోవాలి," అంటూ ప్రిన్సిపాలు లేచాడు. నేను తిరిగి అభ్యర్థించేలోపుగా "సరే, నాకు టౌన్‌హాలులో పని వుంది. మనం ఎక్కువసేపు మాట్లాడలేనందుకు విచా రిస్తున్నాను" అంటూ లోపలకు వెళ్ళాడు.

ఈ విషయం కనకారావుకు చెప్పటానికి జంకాను. నాకు ప్రిన్సిపాలుకు జరిగిన సంభాషణ అంతా ఒక కాగితంమీద వ్రాసి అతనికి పంపించాను.

తరువాత కొద్దిరోజులలో కనకారావులో విచిత్రమయిన మార్పు వచ్చినది. అతని దినచర్య తను కాపీచెయ్యలేదని ఇతరులను నమ్మించటానికి నిర్విరామకృషి. ప్రతిరోజూ ప్రొద్దుననుంచి అర్ధరాత్రివరకు హాస్టలులో ప్రతివాడి గదికి వెళ్లి చెప్పిన విషయాలే చెప్పుతూ వుండేవాడు. అతనిమాటలు వాళ్లు నమ్మలేదు. అతను చెప్పినంతసేపు వాళ్ళు జాగ్రత్తగా విన్నట్లు నటించారు, కాని వెనుక ఘక్కున నవ్వారు.

కనకారావు తన నిర్దోషిత్వాన్ని చాట టానికి రోజుకొకవిధంగా వాదించేవాడు. తను కాపీచేస్తే ఎవరిదగ్గర చేసివుంటాడు? పరీక్షహాలులో తనచుట్టూ క్లాసుమేట్లు లేరు గదా! పోనీ కాగితాలమీద వ్రాసుకు వెళ్లాడా? అలాంటప్పుడు అన్ని ప్రశ్నలు చూసి వ్రాయటానికి మూడు గంటలకన్నా ఎక్కువకాలం పడుతుంది. కాని తనుమూడు గంటలలోనే అన్ని ప్రశ్నలకు జవాబులు వ్రాశాడుకదా!—ఇలా వుండేవి అతని వాదనలు. హాస్టలులో విద్యార్థులంతా యీ వాదనను సరదాగా వినేవారు. అతనిని పైకిమాత్రం ఉత్సాహపరచి లోలోపల నవ్వుకొనేవారు. అతనిని తెలివైన దొంగగా పరిగణించేవారు.

తరువాత మాఘమాసంలో ఒక చీకటి రాత్రి, తీవ్రమయిన జ్వరంలో తాను పరీక్ష లలో కాపీ చెయ్యలేదని కలవరిస్తూ మరణిం చాడు. చనిపోయేముందు—సిక్ రూములో అతనితోబాటు నేను వున్నాను—అతను కోరుకొన్నది పెట్టెలోవున్న అతని తల్లి దండ్రుల ఫోటోలు చూపించమని. ఆ ఫోటోలు అతనిబాధను అవగాహన చేసు కొన్నాయేమో. అతని నిజాయితీని నమ్మా యేమో.

* * *

ఇది కనకారావు విషాద గాథ.

నేను జరిగిపోయిన సంగతులు జ్ఞాపకం వచ్చి బాధపడటం గ్రహించాడు నరసింహం.

"కనకారావు మాట యెత్తగానే పాత సంగతులు జ్ఞాపకం వచ్చాయి కాబోసు. పొరపాటున కనకారావు విషయం వచ్చిం దిలే. వెరీ సారీ" అన్నాడు నరసింహం.

"పాపం కనకారావుది చాల సెన్సిటివ్ హార్ట్ రా" అన్నాడు రామారావు.

నాకు కనకారావు విషయం వాళ్ళతో మాట్లాడటం ఇష్టంలేదు.

"నాకిప్పుడు నిద్ర వస్తోంది" అన్నాను వాళ్ళిద్దరూ సెలవు తీసుకుంటారేమోనని.

"నీకు నిద్ర రానిదెప్పుడుగాని, గుడ్ నైట్" అన్నాడు నరసింహం.

"డిట్టో" అన్నాడు రామారావు.

"గుడ్ నైట్" నిస్సత్తువగా అన్నాను. ★

